యథేచ్ఛగా దోపిడీ!

- కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో అక్రమాలకు పాల్పడుతున్న కమీషన్ ఏజెంట్లు
- జరిమాన విధించినా కనిపించని మార్పు
- హద్దులేని దురాశ
- ఒకేరోజు నలుగురు రైతుల నుంచి అధికంగా రూ.17,731 కాజేసిన వైనం
- బాధితులు ప్యాపిలి మండలం మునిమడుగు గ్రామానికి చెందిన రైతులు
- లైసెన్స్ రద్దు చేసిన మార్కెట్ కమిటీ పాలకవర్గం

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీలో కమీషన్ ఏజెంట్ల అక్రమాలు అన్నీ, ఇన్నీ కావు. రైతులను దగా చేయడమే లక్ష్యంగా కొంతమంది వ్యవహరిస్తున్నారు. మార్కెట్‌లో అక్రమాలను సమూలంగా రూపుమాపాలనే లక్ష్యంతో జరిమానాలు విధిస్తున్నా కమీషన్ ఏజెంట్లలో మార్పు రావడం లేదు. ఇటీవలే కమీషన్ ఏజెంట్ ఈశ్వర్ ట్రేడర్ అధినేత అరవింద్ షేట్ లైసెన్స్ రద్దు చేశారు. ఈయన రైతులను దగా చేసిన తీరును పరిశీలిస్తే ముక్కున వేలేసుకోవాల్సిందే. గత ఏడాది డిసెంబరు నెలలో ఈ కమీషన్ ఏజెంటు ఇకే రోజు ముగ్గురు రైతులను మోసం చేశారు. ముగ్గురి నుంచి హమాలీ చార్జీల కింద రూ.800 అధికంగా తీసుకున్నారు. దీనిపై మార్కెట్ కమిటీకి ఫిర్యాదులు అందడంతో రూ.10 వేలు జరిమానా విధించారు. మరోసారి ఇలా రైతులను దగా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అయినా, తీరు మారలేదు. ఈ నెల 5న ప్యాపిలి మండలం మునిమడుగు గ్రామానికి చెందిన రైతులు మొక్కజొన్న పంటను తెచ్చారు. గ్రామీణ రైతులు అమాయకంగా కనిపించడంతో అడ్డగోలుగా దోపిడీ చేసి మార్కెట్ కమిటీకి దొరికిపోయాడు. ఒక బస్తాకు అన్‌లోడింగ్, కోత, చేటలకు సంబంధించి హమాలీ చార్జీల కింద రూ.12.81 మాత్రమే రైతుల నుంచి వసూలు చేయాలి. సదరు కమీషన్ ఏజెంట్ బస్తాకు రూ.30 ప్రకారం వసూలు చేసినట్లు స్పష్టమవుతోంది. ప్యాపిలి మండలం మునిమడుగు గ్రామానికి చెందిన నలుగురు రైతుల నుంచి తీసుకోవాల్సిన మొత్తంపై అదనంగా రూ. 17,731 కాజేశారు. ఖదర్‌బాషా అనే రైతు నుంచి రూ.4723, బాష అనే రైతు నుంచి రూ.2,670, రామాంజనేయులు అనే రైతు నుంచి 6,943, వెంకటరాముడు అనే రైతు నుంచి రూ.3,395 ప్రకారం అధికంగా వసూలు చేశారు. కమీషన్ ఏజెంటు చేతిలో మోసపోయామని గుర్తించిన రైతులు మార్కెట్ కమిటీకి ఫిర్యాదు చేయడంతో వెంటనే స్పందించి పూర్తిగా లైసెన్స్ రద్దు చేసింది. కర్నూలు మార్కెట్ యార్డులో రైతులను దగా చేసే కమీషన్ ఏజెంట్లు అనేక మంది ఉన్నారు. అయితే, దొరికితేనే దొంగ అనే చందనా ఉన్నట్లు తెలుస్తోంది.

ఇప్పటికే పలువురికి జరిమానా, లైసెన్స్‌లు రద్దు

ప్రతి రైతుకు విధిగా ఈ-నామ్ తక్‌పట్టీ ఇవ్వాల్సి ఉంది. ఇప్పటికి అనేక మంది తక్‌పట్టీలు ఇవ్వడం లేదు. తెల్లకాగితాలపైనే వివరాలు రాసి ఇస్తున్నారు. కొంత మంది తక్‌పట్టీలు ఇస్తున్నా.. వెనక అక్రమాల లెక్కలు రాసి ఇస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఇటీవల ఓం లలితా ట్రేడర్స్, వాసవి కమీషన్ ఏజెంటు, రాజేష్ ట్రేడింగ్ కంపెనీ, లలితాదేవి ట్రేడర్స్, చలపతి ట్రేడర్స్, ఈశ్వర్ ట్రేడర్స్ కమీషన్ ఏజెంట్లు రైతులను దగా చేసినట్లు తేలింది. దీంతో వారికి జరిమానా విధించడంతో పాటు వారం రోజుల పాటు లైసెన్స్‌లు రద్దు చేశారు. రైతులను దగా చేసి ఎంత కాజేశారో ఆ మొత్తాన్ని రైతులకు ఇప్పించారు. ఇన్ని చర్యలు ఉన్నా.. ఏజెంట్లలో మార్పు రాకపోవడం గమనార్హం. ఇప్పటికీ రైతులను దగా చేసి జేబులు నింపుకుంటున్న కమీషన్ ఏజెంట్లు మార్కెట్‌లో ఉన్నట్లు ఫిర్యాదులున్నాయి. నిబంధనసుసరించి హమాలీ చార్జీల కింద బస్తాకు రూ.12.81 మాత్రమే రైతు నుంచి వసూలు చేయాలి. అయితే, ఎవరికి వీలైనంత మేర వారు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. కొంతమంది ఏజెంట్లు కమీషన్ కూడా ఎక్కువ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఉల్లి మినహా అన్ని రకాల వ్యవసాయ ఉత్పత్తులపై 2 శాతం కమీషన్ తీసుకోవాల్సి ఉంది. ఉల్లికి 4 శాతం కమీషన్ ఉంది. ఇంతకంటే ఎక్కువ కమీషన్ తీసుకుంటున్నారని విమర్శలు ఉన్నాయి.


కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

రైతులు అప్రమత్తంగా ఉండాలి..



కర్నూలు మార్కెట్‌లో వ్యవసాయ ఉత్పత్తులను అమ్ముకోవడానికి వచ్చిన రైతులు అప్రమత్తంగా ఉండాలి. పంటలు అమ్మిన తర్వాత నగదు తీసుకునేటప్పుడు హమాలీ చార్జీలు, కమీషన్ ఏజెంటు కమీషన్ కింద తీసుకున్న మొత్తంపై అవగాహన చేసుకోవాలి. అన్‌లోడింగ్, కోత, చేటలకు సంబంధించి రూ.12.81 మాత్రమే బస్తాకు హమాలీ చార్జీ చెల్లించాలి. ఇంతకంటే ఒక్క రూపాయి ఎక్కువ తీసుకున్నా నేరమే అవుతుంది. ఇలా ఎవరైనా చేస్తే మార్కెట్ కమిటీలో ఫిర్యాదు చేయవచ్చు. –గోవిందు, సెక్రటరీ, మార్కెట్ కమిటీ కర్నూలు

కోడుమూరులో నేటి కార్యక్రమాలు

తహసీల్దార్ కార్యాలయంలో 'స్పందన'

కోడుమూరు రూరల్ : ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా కోడుమూరులోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శేషఫణి ఆదివారం తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని, ప్రజలు ఏవైనా సమస్యలుంటే అర్జీల రూపంలో సమర్పిస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

'వలంటీర్లకు వందనం'

సంక్షేమ పథకాల అమలులో ఉత్తమ సేవలందించిన వలంటరీలను సత్కరించేందుకు సోమవారం ఉదయం 11గంటలకు కోడుమూరు బాలుర హైస్కూల్లో 'వలంటీర్లకు వందనం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ ఆదివారం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ విచ్చేసి వలంటీర్లను సత్కరిస్తారన్నారు. కోడుమూరు, ప్యాలకుర్తి, వెంకటగిరి, ముడుమలగుర్తి గ్రామ సచివాలయాల వలంటీర్లు తప్పక హాజరు కావాలని కోరారు.

'గడప గడపకు మన ప్రభుత్వం'

కోడుమూరులోని గ్రామ సచివాలయం 3, 4ల పరిధిలోని కాలనీల్లో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ ఆదివారం తెలిపారు. కార్యక్రమానికి కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి గడపకు వెళ్లి ప్రజలకు వివరించడంతో పాటు వారి సమస్యలను తెలుసుకుంటారని చెప్పారు.

క్లుప్తంగా

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం


పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

ఓర్వకల్లు: మండల కేంద్రంలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి తనయుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు కాటసాని శివనరసింహారెడ్డి సౌజన్యంతో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం చేట్ల ఏసేపు ప్రారంభించారు. విజేతలకు మొదటి బహుమతిగా రూ.25 వేలు, రెండో బహుమతిగా రూ.15 వేలు, మూడో బహుమతిగా రూ.10 వేల చొప్పున నగదు బహుమతులను ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చేట్ల సంజన్న, చేట్ల సతీష్‌బాబు, చేట్ల కుమార్, జిల్లా కృష్ణ, బోయ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలతో విజ్ఞానం

పాణ్యం: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగాలని, చిన్నప్పటి నుంచే గ్రంథాలయాల పట్ల శ్రద్ధ చూపేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని గ్రామ కార్యదర్శి ప్రకాష్ అన్నారు. ఆదివారం పాణ్యం శాఖ గ్రంథాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతున్న ప్రభుత్వం అమలు చేస్తున్న సమ్మర్ క్యాంప్‌తో పిల్లలో కొత్త ఆలోచనలను వెలికితీసినట్లయ్యిందన్నారు. అనంతరం సమ్మర్‌క్యాంప్‌లోని పిల్లలతో మాట్లాడి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

కోడుమూరు : కోడుమూరు ఏపీ మోడల్ స్కూల్‌లో ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో చేరేందుకు పది పాసైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఆశాజ్యోతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 22 నుంచి జూన్ 7వ తేదీలోగా నిర్ణీత ఫీజు చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోండి

కల్లూరు: వేరుశనగ విత్తనాలు కావాల్సిన రైతులు ఆయా గ్రామాల ఆర్బీకేల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలానికి మొత్తం 50 క్వింటాళ్ల వేరుశనగ మంజూరైనట్లు వెల్లడించారు. తడకనపల్లె-14, ఉలిందకొండ-సచివాలయం2 (యాపర్లపాడు)-11 బస్తిపాడు-5, బొల్లవరం -5, కె.మార్కపురం-5, లక్ష్మీపురం (సచివాలయం1) -5, నాయకల్లు-5 క్వింటాళ్ల చొప్పున కేటాయించన్నట్లు పేర్కొన్నారు. వేరుశనగ విత్తనం క్వింటా రూ.9,300 ఉండగా 40శాతం సబ్సిడీ పోను రైతులు రూ. 5,580 చెల్లించాల్సి ఉంటుందన్నారు.

నేడు ఎల్లమ్మ దేవస్థానం హుండీ ఆదాయం లెక్కింపు

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండలం వెంకాయపల్లెలో వెలసిన ఎల్లమ్మ తల్లి దేవస్థానం హుండీ ఆదాయం లెక్కింపు సోమవారం ఉదయం 10గంటలకు నిర్వహించనున్నారు. హుండీ లెక్కింపు ఆదాయంలో ఆలయ కమిటీ సభ్యులందరూ, పూజారులందరూ పాల్గొననున్నారు.

నేడు వేరుశనగ విత్తనాల పంపిణీ

కోడుమూరు రూరల్ : మండలంలోని రైతుల కోసం ఖరీఫ్ సీజన్‌కు గాను ప్రభుత్వం మంజూరు చేసిన వేరుశనగ విత్తనాల పంపిణీని సోమవారం కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ చేతుల మీదుగా స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ప్రారంభిస్తున్నట్లు ఏఓ రవిప్రకాష్ ఆదివారం తెలిపారు. వేరుశనగ క్వింటా రూ.9,300 ధర నిర్ణయించగా, ప్రభుత్వం ఇచ్చే 40శాతం సబ్సిడీ పోను రైతుకు రూ.5,580 చెల్లించాల్సి ఉంటుందన్నారు. అవసరమైన రైతులు ఆయా ఆర్బీకేల్లో సంప్రదించాలని సూచించారు.

స్పందనకు హాజరుకాకపోతే చర్యలు

సి.బెళగల్: సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే స్పందన కార్యక్రమానికి మండల అధికారులందరూ తప్పనిసరిగా హాజరవ్వాలని తహసీల్దార్ శివశంకర్ నాయక్ అన్నారు. స్పందనకు గైర్హాజరయ్యే అధికారులపై నివేదికలను కలెక్టర్ కార్యాలయానికి పంపించడంతో పాటు ఉన్నతాధికారులకు చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు.

సమస్యల పరిష్కారానికి చక్కటి వేదిక 'స్పందన'

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలకు చక్కటి పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం అని కర్నూలు రూరల్ తహసీల్దార్ ఆర్ శివరాముడు అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలపై సోమవారం ఉదయం 10.30 నుంచి 2 గంటల వరకు జరిగే 'స్పందన' కార్యక్రమంలో ప్రజలు అర్జీల రూపంలో సమస్యలు తెలియజేస్తే పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

ఉన్నత లక్ష్యాలతో భవిష్యత్తుకు బాట

- వ్యక్తిత్వ వికాస నిపుణులు రాజారామ్ కొల్లే

కర్నూలు కల్చరల్: యువత ఉన్నత లక్ష్యాలు కలిగి భవిష్యతుకు బాటలు వేసుకోవాలని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు రాజారామ్ కొల్లే అన్నారు. తిరుపతి పినాక సొసైటీ, పీపుల్స్ ఎంపవర్‌మెంట్, హైదరాబాద్ ఇన్‌కమ్ ట్యాక్స్ అడిషినల్ కమిషనర్ బి.యాదగిరి ఐఆర్‌ఎస్, అమీలియో హాస్పిటల్స్ అధినేత డాక్టర్ లక్ష్మీ ప్రసాద్ చాపె ఆధ్వర్యంలో రెవెన్యూ కాలనీలోని రవీంద్ర పాఠశాలలో నిర్వహిస్తున్న స్పోకెన్ ఇంగ్లిష్, కమ్యూనికేషన్ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, జేకే, గ్రూప్, సివిల్స్ ప్రిపరేషన్ గైడెన్స్‌కు సంబంధించిన ఉచిత శిక్షణ తరగతులకు ఆయన ఆదివారం హాజరయ్యారు. వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. యువత చదువుతో పాటు సంస్కారం, పట్టుదల, క్రమశిక్షణ కలిగి నిర్దేశించుకున్న లక్ష్యం కోసం నిరంతరం కష్టపడితే ఉత్తమ ఫలితాలు పొంద వచ్చన్నారు. కోర్సు డైరెక్టర్, రాయలసీమ విద్యార్థి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కె.రవికుమార్, జిల్లా అధ్యక్షుడు అశోక్, మాదాసి మాదారి కురువ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు సుంకన్న, ప్రజా పరిరక్షణ సమితి అధ్యక్షుడు బలరాం, ఎర్రకోట మల్లప్ప, తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న వ్యక్తిత్వ వికాస నిపుణులు రాజారామ్ కొల్లే

ఉత్తమ జీవనానికి సోపానాలు ఇతిహాసాలు

కర్నూలు కల్చరల్: ఉత్తమ జీవనానికి భారత, భాగవత, రామాయణ ఇతిహాసాలు సోపానాలుగా నిలుస్తాయని ఇస్కాన్ ప్రవచకులు వైష్ణోకృప చైతన్య ప్రభు అన్నారు. ఆదివారం స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని జగన్నాథ మందిరంలో శీల ప్రభు పాదుల ప్రేమ విందు కార్యక్రమం నిర్వహించారు. జగన్నాథ్, సుభద్ర, బలదేవ్‌లను ప్రత్యేకంగా అలంకరించి దర్శనం కల్పించారు. అనంతరం వైష్ణోకృప చైతన్య ప్రభు సందేశమిస్తూ భగవద్గీత పఠనం, శ్రవణంతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. జఠిలమైన సమస్యల పరిష్కారానికి మార్గం చూపుతాయన్నారు. పిల్లలకు విద్యార్థి దశ నుంచే దేశభక్తి, ఆధ్యాత్మిక అంశాలపై ఆసక్తి కలిగేలా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.


సందేశమిస్తున్న వైష్ణోకృప చైతన్య ప్రభు

24న ఆలయ నిర్మాణ యజ్ఞము

గూడూరు : ఈ నెల 24న గూడూరు పట్టణంలోని లక్ష్మీవేంకటేశ్వర, అయ్యప్ప స్వాముల ఆలయ నిర్మాణ యజ్ఞము నిర్వహిస్తున్నట్లు ఆదివారం ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మహా గణపతి పూజ, పుణ్యాహవాచనము, గోపూజ, యాగ సంకల్పం, దీక్షా ధారణ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

శ్రీశైలంలో స్థలం కేటాయించాలి

కర్నూలు(సెంట్రల్): భావసార క్షత్రియుల అన్నదాన కేంద్రానికి శ్రీశైలం పుణ్యక్షేత్రంలో ఒక ఎకరా స్థలం కేటాయించాలని భావసార క్షత్రియ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.శివశంకరరావు డిమాండ్ చేశారు. ఆదివారం జెడ్పీ నుంచి కలెక్టరేట్ వరకు ఆ సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. జిల్లా కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కర్నూలు సిటీ: బైక్ అదుపు తప్పి కిందపడిన ఘటనలో చికిత్స పొందుతూ పసుపుల గ్రామ సమీపంలోని బాలాజీ విల్లాస్‌కి చెందిన యువకుడు ఇ.సూర్యప్రకాష్ (26)మృతి చెందాడు. కారు డ్రైవర్‌గా పనిచేసే ఈ యువకుడు కోడుమూరు రోడ్డులోని బంధువుల ఇంటి నుంచి ఈనెల 17వ తేదీ తెల్లవారుజామున నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని యజమాని ఇంటికి బైక్‌పై బయలుదేరాడు. చౌరస్తా సమీపంలోని టీవీఎస్ షోరూం దగ్గర కుక్క అడ్డురావడంతో బైక్ అదుపు తప్పి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన ఈ యువకుడు స్థానిక ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక ఆదివారం మృతి చెందాడు. ఈ మేరకు మృతుడి తండ్రి చెన్నయ్య ఫిర్యాదుతో నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.


మృతి చెందిన సూర్యప్రకాష్

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కర్నూలు సిటీ: పంచలింగాల సమీపంలోని తుంగభద్ర నదిలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. మృతుడికి 40 సంవత్సరాలు వయస్సు ఉండి పూల్ హ్యాండ్ ఎరుపు టీషర్ట్, కాకి కలర్ ప్యాంట్, నస్యం కలర్ పూల్ డ్రాయర్ ధరించి ఉన్నాడు. కుడి చేతిపై రాజు అని పచ్చబొట్టు, మెడకు ఆకుపచ్చరంగు గుడ్డతో చుట్టిన తాయత్తు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు కర్నూలు పోలీసు స్టేషన్ సీఐ సెల్ నంబరు 9121101063, ఎస్ఐ సెల్ నంబరు 9177181578, పోలీసు స్టేషన్ ల్యాండ్ నంబరు 08518-220093ను సంప్రదించాలని తాలూకా పోలీసులు వెల్లడించారు.


తుంగభద్ర నదిలో లభ్యమైన మృతదేహం

గాలీవాన బీభత్సం

కోడుమూరు రూరల్ : మండలంలోని ప్యాలకుర్తి, ఎర్రదొడ్డి, అనుగొండ, వెంకటగిరి గ్రామాల్లో ఆదివారం సాయంత్రం గాలీవాన బీభత్సం సృష్టించింది. ప్యాలకుర్తి బస్‌స్టేజి వద్ద ఉన్న బొమ్మరిల్లు ధాబాకు సంబంధించి రేకులషెడ్డు, గుడిసెలు గాలికి ఎగిరిపోవడంతో పాటు, వంట సామగ్రి చెల్లాచెదురవ్వడంతో నిర్వాహకులకు సుమారు రూ.లక్షకు పైగా నష్టం వాటిల్లింది. అలాగే ఏపీ గోదాముకు సంబంధించిన రేకులు కూడా బలమైన ఈదురుగాలులకు చెల్లాచెదురుగా పడిపోయాయి. ఎర్రదొడ్డి, అనుగొండ, వెంకటగిరి గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో ఆయా గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

విరిగిన చెట్లు, స్తంభాలు

సి.బెళగల్: మండలంలో ఆదివారం సాయంత్రం ఒక్క సారిగా వీచిన ఈదురు గాలులకు పలు గ్రామాలలో విద్యుత్ స్తంభాలు, చెట్లు విరిగిపడ్డాయి. మండల పరిధిలోని పోలకల్, కొండాపురం గ్రామాలలో వడగళ్ల వర్షం కురిసింది. ముడుమాల గ్రామంలోని తెలుగు వెంకటేశ్వర్లుకు చెందిన కిరాణం దుకాణంపై భారీ వేపచెట్టు కూలడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. అదే గ్రామంలో దాదాపు పదికి పైగా విద్యుత్ స్తంభాలు పడిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు. అలాగే పోలకల్ గ్రామంలోని తువ్వ చేను ప్రాంతంలో విద్యుత్ స్తంభంతో పాటు భారరీ చెట్టు కూలడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. కాగా మండలంలోని పలు గ్రామాలలో విద్యుత్ స్తంభాలు పడిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగి ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు.


సి.బెళగల్ మండలం ముడుమాల గ్రామంలో కిరాణ దుకాణంపై పడిన వేపచెట్టు

రోడ్డుపై విరిగి పడిన చెట్టుకొమ్మ

కల్లూరు : మండల పరిధిలోని దొడ్డిపాడు నుంచి లక్ష్మీపురం గ్రామానికి వెళ్లే రోడ్డులో ఉన్న మర్రిచెట్టు కొమ్మ శనివారం రాత్రి విరిగి రోడ్డుకు అడంగా పడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు వాహనలు, ఆటోలో, బైక్‌లు, ఇతర వాహనలు రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడ్డారు.

వైభవంగా చెన్నకేశవస్వామి ఉత్సవాలు

గడివేముల: మండల పరిధిలోని దుర్వేశి గ్రామంలో 25 ఏళ్ల అనంతరం నిర్వహిస్తున్న లక్ష్మీచెన్నకేశవ స్వామి ఉత్సవాలు ఆదివారం వైభవంగా జరిగాయి. గ్రామంలోని కులమతాలకు అతీతంగా ఉత్సవాలు జరుపుకోవడంతో పండుగ వాతారణం కనిపించింది. ఏ ఇంటి వద్ద చూసినా బంధువులతో ఇళ్లు కళకళలాడాయి. ఉదయం నుంచి రాత్రి వరకు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు గ్రామోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామంలో ఉత్సవాల సందర్భంగా ఎలాంటి పాణ్యం సీఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్ఐలు బీటీ వెంకటసుబ్బయ్య, సుధాకర్‌రెడ్డి ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు.

రైతు సంబరాలు నిర్వహించడం సంతోషదాయకం

గ్రామాల్లో రైతు సంబరాలు నిర్వహించడంతో ఎంతో ఆనందదాయకమని నంద్యాల జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు,పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. చెన్నకేశవస్వామి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి బండలాగు పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఉత్సవాల సందర్భంగా గ్రామంలో రైతుల సంబరాలు నిర్వహించడం శుభపరిణామమన్నారు. ముఖ్యమంత్రి అధికారంలోకి వచ్చిన అనంతరం వర్షాలు సకాలంలో కురవడంతో పాటు ప్రభుత్వం రైతులకు అన్ని సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. దీంతో రైతులు రెండు సీజన్లు పంటలను పండించుకుని ఆనందగా ఉన్నారన్నారు. అనంతరం ఎమ్మెల్యేను గ్రామస్తులు, పెద్దలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, పాణ్యం మాజీ జెడ్పీటీసీ సద్దల సూర్యనారాయణరెడ్డి, నంద్యాల జిల్లా వ్యవసాయ కమిటీ చైర్మన్ శిరుప శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ మండ్ల మమత, వైఎస్సార్‌సీపీ నాయకులు రమేష్, కృష్ణారెడ్డి, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


రాష్ట్రస్థాయి బండలాగు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

భర్త కనిపించడం లేదని ఫిర్యాదు

పాణ్యం : నంద్యాలకు పని మీద వెళ్లిన తన భర్త ఇప్పటి వరకు తిరిగి రాలేదని భార్య భారతి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుధాకర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ఓర్వకల్లు మండలం బ్రహ్మణపల్లెకు చెందిన భారతికి బండిత్మకూరు మండలం బి.కొడూరుకు చెందిన పెనవడి నాగరాజుతో మూడెళ్ల క్రితం ప్రేమ వివాహమైంది. ఇద్దరు కలిసి పాణ్యంలోని బీసీ కాలనీ నివాసముంటున్నారు. తన భర్త నంద్యాలకు ఇటుకల పనికి వెళ్తాడని, బుధవారం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని ఫిర్యాదులో పేర్కొంది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గూడూరు రూరల్: మండల పరిధిలోని జూలకల్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్ర గాయాలపాలయ్యారు. కంబదహాలుకు చెందిన ఇద్దరు వ్యక్తులు గూడూరుకు బైక్‌పై బయలుదేరారు. అయితే మార్గమధ్యలోని జూలకల్ వద్ద వస్తుండగా ఆవు అడ్డు రావడంతో తప్పించబోయి రోడ్డు పక్కన ఉన్న స్తంభాన్ని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో 108 ద్వారా స్థానికులు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన వివరాలు తెలియాల్సిఉంది.

కేసు నమోదు

గడివేముల: మండల కేంద్రమైన గడివేముల గ్రామానికి చెందిన దాసరి శ్రీధర్‌బాబు ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బీటీ వెంకటసుబ్బయ్య ఆదివారం తెలిపారు. పాత కక్షలు మనసులో పెట్టుకుని బాధితుడిపై కొమ్ముసుధాకర్, రమణయ్య, శ్రీధర్‌బాబు దాడిచేసి గాయపరిచారన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

రాజీవ్‌గాంధీకి నివాళి

కల్లూరు : మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతిని ఆదివారం కల్లూరు అర్బన్ నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని దామోదరం సంజీవయ్య భవనంలో నంద్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీ నరసింహయాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు బాలస్వామి, పఠాన్, సాంబశివుడు పాల్గొన్నారు.

ప్రపంచ శాంతికి కృషి చేయాలి

కర్నూలు కల్చరల్: ప్రపంచ శాంతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని లయన్స్ గవర్నర్స్ ప్రతినిధి లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ ఆధ్వర్యంలో ఆదివారం జాతీయ ఉగ్రవాద వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉగ్రవాదంతో జరిగే అనర్థాలపై వీఆర్ కాలనీలోని నైస్ కంప్యూటర్స్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగ్రవాదానికి వ్యతిరేకంగా కలిసికట్టుగా పోరాడాలన్నారు.

మట్టిరోడ్డుతో భక్తుల అవస్థలు

గూడూరు రూరల్: మండల పరిధిలోని పొన్నకల్ అయ్యకొండ మిన్నెల్లస్వామి దర్గాకు చాలా ప్రత్యేకత ఉంది. నిత్యం భక్తులు కొండపైకి వెళ్లి పూజలు, మొక్కుబడులు తీర్చుకుంటుంటారు. పురాతన దర్గా కావడంతో ప్రతి గురువారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు నిద్ర చేసేందుకు వస్తుంటారు. అయితే పొన్నకల్ గ్రామానికి చేరుకునేందుకు వాహన సౌకర్యం ఉండంగా.. అక్కడి నుంచి దర్గాకు వెళ్లేందుకు సరైన రోడ్డు లేకపోవడంతో నడిచి చేరుకోవాల్సిన పరిస్థితి. కొందరు భక్తులు సొంత వాహనాలు ఏర్పాటు చేసుకొని వచ్చినా మట్టి రోడ్డుపై గుంతలు ఉండటంతో ఇబ్బందులు తప్పడం లేదు. గతంలో దర్గా వరకు సీసీ రోడ్డును ఏర్పాటు చేయాలని ప్రజలు కోరినా అంగన్‌వాడీ కేంద్రం వరకు రోడ్డు వేసి కొండపైకి వేయకుండా వదిలివేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కొండపైకి వెళ్లేందుకు అవసరమైన సీసీ రోడ్డు, దాహార్తిని తీర్చేందుకు తాగునీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.


మిన్నెల్లస్వామి దర్గాకు వెళ్లే మట్టి రోడ్డు

పొంచివున్న ప్రమాదం

- వర్కూరులో శిథిలావస్థకు చేరిన నీళ్ల ట్యాంకు
- పట్టించుకోని అధికారులు
- భయాందోళనలో గ్రామస్తులు

కోడుమూరు రూరల్ : కోడుమూరు మండలం వర్కూరు గ్రామంలో మంచినీటి ట్యాంకు శిథిలావస్థకు చేరి ఇప్పుడో అప్పుడో కూలేందుకు సిద్ధంగా ఉండడంతో చుట్టుపక్కల నివాసముంటున్న ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. వర్కూరు ప్రజల నీటి అవసరాలను తీర్చేందుకు 1986లో ట్యాంకును నిర్మించారు. ట్యాంకు నిర్మించి దశాబ్దాలు గడవడంతో దాని పిల్లర్లు పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో పాటు, ఇనుప కడ్డీలు బయటకు వచ్చి పెచ్చులూడిపడుతున్నాయి. దీంతో గత కొన్ని నెలలుగా పంచాయతీ అధికారులు ట్యాంకును ఉపయోగించడం లేదు. అయితే ట్యాంకు పరిస్థితి చూస్తుంటే ఇప్పుడో అప్పుడో కూలే విధంగా ఉండడంతో చుట్టుపక్కల ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. శిథిలావస్థకు చేరిన ట్యాంకు కూల్చివేయాలంటూ పలుమార్లు మండల అధికారులకు అర్జీలిచ్చినా పట్టించుకోవడం లేదంటూ వాపోతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రాణ నష్టం జరుగకముందే శిథిలావస్థకు చేరిన ట్యాంకును కూల్చివేయాలని వర్కూరు గ్రామస్తులు కోరుతున్నారు.


పూర్తిగా దెబ్బతిన్న మంచినీటి ట్యాంకు పిల్లర్


పెచ్చులూడిపోయి కడ్డీలు తేలి ప్రమాదకరంగా ఉన్న ట్యాంకు


వర్కూరులో జనవాసాల మధ్య ప్రమాదకరంగా ఉన్న శిథిలావస్థకు చేరిన ట్యాంకు

అధికారుల దృష్టికి తీసుకెళ్లా

వర్కూరులో ట్యాంకు శిథిలావస్థకు చేరిన విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. గ్రామ పంచాయతీలో తీర్మానం చేసి త్వరలో శిథిలావస్థకు చేరిన ట్యాంకును తొలగించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. – ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, కోడుమూరు.